




## (గత సంచిక తరువాయి)

**ఆవిడని తిరువణ్ణామలై** తీసుకువెళ్ళాలని తపన. తిరువణ్ణామలైలో ఎక్కడ ఉండాలి? చలంగారి ఆశ్రమం. అయితే మా అమ్మ చాలా సనాతనం. మంచినీళ్ళనైనా మరోసారి కడిగి గాని తాగనంత నిష్ఠ. మరి చలంగారింట్లో వజీర్ రెహ్మాన్ ఉన్నారు. ఆయన పకపక భర్త. ఉండడానికి అంగీకరిస్తుందా? అంగీకరించకపోతే అప్పుడే మార్గాంతరం ఆలోచించ వచ్చనుకున్నాను. సాహసించి వారి ఆశ్రమానికి తీసుకొచ్చాను. తలుపులు దాటి లోపలికి వెళ్ళాం. ప్రసన్నమయిన వదనంతో చలంగారే స్వయంగా మాఅమ్మని భోజనానికి ఆహ్వానించారు. ఆయన మధురమయిన దరహాసం, పలకరింత ఏం చేశాయో తెలీదు. మా అమ్మ తలూపింది. నా మనస్సు కుదుటపడింది. మరి వజీర్ రెహ్మాన్ సంగతి? ఎప్పుడు ముంచుకు వస్తుంది ఉపద్రవం? ఎదురు చూస్తున్నాను. విచిత్రం ఏమిటంటే సాయంకాలానికి మా అమ్మ పకపకతోనే చేరికయింది. పైగా రాత్రి జరిగిన భజనలో ఆవిడ స్వయంగా పాటలు పాడింది. చలంగారూ, సౌరీస్ గంభీరమయిన కంఠాలను మేళవించి టాగూర్ గీతం ఆలపించడం గుర్తుంది.

నేడే రమ్ము, నేడే రమ్ము

వాడిన ఈ సుమము కోయూ

నేలవాలి పోవునో, పెంధూళి కౌగిలే యౌనో

వేసవి నిశ్వాసములో

పాట యిప్పటికీ చెవుల్లో మారుమ్రోగుతుంది. చలంగారిలో ఈ పరివర్తన పాత చలాన్ని అభిమానించే నాలాంటి వారికి కూడా వింతగా కనిపించదు. గతాన్ని ఎంత నిర్దాక్షిణ్యంగా చెరిపేశారో, వర్తమానంలో నమ్మకాలకు అంతే చిత్తశుద్ధితో అంకితమయారని ఆ ఆశ్రమ జీవితం చెప్తుంది. తమ జీవితకాలంలో తమ తమ దృక్పథాలను మార్చుకున్నా మేధావుల మీద దరిమిలాను ఓ వ్యాసం రాస్తూ చలంగారినీ అందులో ప్రస్తావించాను.

చిత్తూరులో ఉన్న మూడు సంవత్సరాలూ ముందు జీవితానికి అద్భుతమయిన తర్ఫీదు. నా వక్తృత్వానికి అక్కడే మొదటి విత్తులు పడ్డాయి. ఆంధ్రప్రభ కీర్తిని ఆశించేవారందరికీ తేనెపట్టు. అందరూ పరోక్షంగా మమ్మల్ని చేరదీసేవారు. అలా నన్ను తమతో తిప్పిన స్థానిక నాయకులు చిన్నమరెడ్డి అనే ఎమ్మెల్యే. కుప్పిరెడ్డి అనే సమితి అధ్యక్షుడు. వారు వెళ్ళే ఏ చిన్న సభకయినా నాకు జీపు వచ్చేది. వార్తలు సేకరించడం మా ఉద్యోగం కనుక కృష్ణగారు నన్ను వెళ్ళనిచ్చేవారు. సభలో ఇప్పుడు ఆంధ్రప్రభ ఉపసంపాదకులు గొల్లపూడి మారుతిరావుగారు మాట్లాడతారు అంటే చాలు – దేని గురించి? నీటి సరఫరా, నిరక్షరాస్యత, పరిశుభ్రత, ఆరోగ్యం ఏదయినా గడగడా మాట్లాడడం ఓ వ్యసనమయిపోయింది. క్రమంగా మాటల ఎంపిక, విషయాన్ని ప్రకటించడంలో ఓ ప్రణాళిక, భావాన్ని అలంకరించడం, కొసమెరుపు, ముగింపు అవకాశాన్ని, అవసరాన్ని బట్టీ ప్రసంగం 'వ్యవధి'ని కుదించడమో, విస్తరించడమో చెయ్యడం. ముఖ్యంగా విషయాన్ని లొంగదీసుకుని మన ఆలోచనా సరళిలో ప్రకటించే నేర్పు – యివన్నీ క్రమంగా సానబెట్టడం జరుగుతూ వచ్చింది. ఆ దశలో ఉపన్యాసాల పరంపర ఓ వక్తకి మొదటి పాఠశాల.

కె. రామస్వామి అయ్యంగార్ హరిజన సంక్షేమ సంఘానికి అధ్యక్షులు. ప్రతీనెలా ఒక రోజు ఒక హరిజన వాడకి వెళ్ళి ఉపన్యాసం యిచ్చేవాళ్ళం. తర్వాత హరిజనుల సరసన కూర్చుని భోజనం చెయ్యడం కార్యక్రమం. అభ్యుదయ భావాలూ, విప్లవాత్మకంగా జీవించడం వంటి ఆదర్శాలు పెద్దగా లేకపోయినా సంస్కారాన్నీ, అవగాహననీ కలిగించడం. వారితో కలిసి భోజనం చెయ్యడం ఏదో గొప్ప విజయాన్ని సాధించానని ఎప్పుడూ అనుకోలేదు. ఇప్పటికీ ఇలాంటి పట్టింపులు నాకు మనస్సుదాకా పోవు.

మరొక పెద్ద సాధన – ఢిల్లీ ఇంటర్వ్యూలలో పెదవి కదపడం కూడా రాని ఇంగ్లీషుని సానపెట్టడం. రోజూ ఇంగ్లీషు వార్తలతో లజ్జుగుజ్జులు పడడం పెద్ద శిక్షణ. చిత్తూరులో ఉన్న రోజుల్లోనే ఒక జాతీయ ఎన్నిక జరిగిందని చెప్పాను. చక్రవర్తి రాజగోపాలాచారి, మీనూ మసానీ సభలకి హాజరవడం గుర్తుంది. భారతదేశపు మాజీ గవర్నరు జనరల్ రాజాజీ తమ సభకు రక్షణగా నిలిచిన  పోలీసుల్ని, ప్రభుత్వాన్నీ దుయ్యబట్టడం (ఆయన స్వతంత్ర పార్టీ వ్యవస్థాపకులు. కాంగ్రెస్ వ్యతిరేకి) అయినా ప్రభుత్వ యంత్రాంగం బాధ్యతగా ఆయనకి రక్షణ కల్పించడం వింతగా ఉండేది. నాయకుల అభిప్రాయాలకీ, ఉద్యోగుల బాధ్యతలకీ ఏమీ సంబంధం లేదు. వ్యవస్థతో ఇప్పటి ఆయన వ్యతిరేకతకీ, ఒకప్పటి పదవికి దక్కాల్సిన గౌరవానికీ చుక్కెదురు లేదు. ఇది రాజకీయ నీతిలో భాగం. రాజకీయాలలో అభిప్రాయభేదాలూ, వ్యతిరేకతలూ వ్యక్తిగతమయిన శతృత్వానికో, వేర్పాటుకో కారణం కానక్కరలేదన్న సత్యాన్ని గ్రహించింది అప్పుడే. ఆ ఆబ్జెక్టివిటి యే మన ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మ.

ప్రముఖ సాహితీవేత్త ఆచంట జానకీరాంగారు తిరుపతిలో ఉండేవారు. వారి శ్రీమతి ఆచంట శారదాదేవిగారు తిరుపతి మహిళాకళాశాలలో అధ్యాపకులుగా ఉండేవారు. వారి 'సాగుతున్న యాత్ర' (ఆదిభట్ల నారాయణదాసుగారి 'నా యెరుక', శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారి 'అనుభవాలూ – జ్ఞాపకాలూ' తర్వాత తెలుగు స్వీయకథా సాహిత్యంలో తలమానికంగా చెప్పుకోదగ్గ రచన) ఆంధ్రప్రభలో ధారావాహికంగా వస్తోంది. వారిని నేనదే చూడడం. వారి మీద టాగూర్ ప్రభావం బోలెడు. లాలిత్యం, కళాప్రియత్వం, ప్రతీ అంశాన్నీ 'కళ'గా తీర్చిదిద్దుకోవడం, జీవితాన్ని కూడా కళాత్మకంగా అలంకరించుకున్న ధన్యులాయన. నాకంటే వయస్సులో చాలా పెద్ద. ముందు తరం రచయిత. అయినా స్నేహశీలతతో వయస్సు ప్రమేయాన్ని పూర్తిగా వెనక్కు నెట్టగల వ్యక్తి. ఆయన ఆంధ్రప్రభకి వచ్చే సమయానికి నేను పాకాల వెళ్తున్నాను ఏదో సభకి. వారి పరిచయం అవుతూనే బయలుదేరిపోయాను. నేను ఎక్కిన రైలు ఇంకా కదలకుండానే నన్ను వెదుక్కుంటూ స్టేషన్ కి వచ్చేశారు. నా కంపార్టుమెంటు ఎక్కారు “మీ కోసమే చిత్తూరు వచ్చానంటూ”. ఆచంట శారదాదేవిగారి 'పగడాలు' కథల పుస్తకం యిచ్చారు “ప్రభలో సమీక్ష చేయండి” అంటూ. అప్పటికే పురిపండా భారతం సమీక్ష. యింకా చాలా గ్రంథాల సమీక్షలు చేస్తున్నాను. అందుకు ఇదీ నాకు దక్కిన మర్యాద. ఆ ప్రయాణంలోనే ఆయన ఇచ్చిన సలహా “రేడియోలో ప్రొగ్రాం ఎగిక్యూటివ్ ఉద్యోగాలకి ప్రకటన వచ్చింది. తప్పక దరఖాస్తు పెట్టండి. మీరుండవలసిన స్థానం అది” అని. ఆలిండియా రేడియో వాతావరణం. నాటకాలు, ప్రసంగాలు నిర్వహించడంలో అనుభవాలూ, సాధక బాధకాలూ – కళ్ళకు కట్టినట్టు వ్రాసేవారు ప్రతీవారమూ. వారి తల్లి కాలధర్మం చేసిన ఘట్టం ఎంతో ఆర్ధ్రంగా, కళ్ళు చెమర్చేలాగా చెప్పారు. రచయితగా, ఆయనంటే గ్లామరు ఉండేది నాకు.

అయితే ఆయన దరఖాస్తు పెట్టమన్నది ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ ఉద్యోగానికి. తీరా నేను పేపరు చూసి ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగానికి పెట్టాను. ఈ రెండింటి మధ్య తేడా నాకప్పుడు అర్ధం కాలేదు. తత్కారణంగా రేడియోలో నా కృషికి ఏమీ అంతరాయం కలగలేదు. కాని, ఉద్యోగంలో చేరిన మరో ఎనిమిది సంవత్సరాలకి ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌ని కాగలిగాను. అయితే రేడియో నుంచి నేనాశించింది ఎన్నడూ ఆదాయం, హోదా కానే కాదు. అందులో పనిచేసిన 20 ఏళ్ళల్లో ఏ ఒక్కసారీ నా జీతం యింత అన్న గుర్తు నాకు లేదు. ఇది నూటికి నూరుపాళ్ళూ నిజం. అదొక విశ్వవిద్యాలయం నాకు.

ఒకసారి కపిలతీర్ధం రోడ్డులో వారింటికి వెళ్ళి, శని, ఆదివారాలు గడిపాను. మేడమీదకు తీసుకెళ్ళి 60 దేవీప్రసాద్ రాయ్ చౌదరి పెయింటింగులు, తను వేసిన రేఖా చిత్రాలూ చూపారు. వారి యిల్లే ఓ కళాఖండం. సోమవారం ఉదయం బస్సు ఎక్కిస్తూ నా చేతులనిండా ఎర్రటి గులాబీ పువ్వులుంచారు. అదీ జానకీరాం. తర్వాత ఒక జీవితకాలం పాటు ఆయనకీ, నాకూ ఉత్తరాలు సాగాయి.

రాగిమాను వీధిలో మేం ఉన్న రోజుల్లోనే గోరాగారు చిత్తూరు వచ్చారు. గోరాగారు నాస్తికులు. గొప్ప మేధావి. నిర్ధుష్టమయిన విశ్వాసాలున్న మనిషి. తను నమ్మిన సత్యానికి జీవితాన్ని ఉద్యమం చేసుకున్న అభ్యుదయవాది. మనిషి అత్యంత సాత్వికం. ఆ సాయంకాలం కె.సభాగారి 'దేవదత్తం' ఆఫీసులో 'పార్టీ రహిత ప్రజాస్వామ్యం' మీద ఉపన్యాసం యిచ్చారు. సభకి తగు మాత్రం ప్రేక్షకులు వచ్చినా ప్రభ విలేఖరులం మేం ఉన్నాం కనుక తెల్లవారేసరికి వారి సందేశాన్ని రాయలసీమంతా చదువుకుంది. గోరాగారు ఆ రాత్రి మా యింట్లోనే బస చేశారు. ఆయన నమ్మకాల వెనక కారణాలనూ, ఉద్దేశాలను వివరిస్తూంటే ఏ అర్ధరాత్రి దాటేవరకో వింటూ అందరం కూర్చున్నాం. చాలా విషయాలు ఆ దశలో మాకు విచిత్రంగా కనిపించినా వాటిని ఆచరించే ఆయన చిత్తశుద్ధీ, ఆయన లక్ష్య శుద్ధీ మమ్మల్ని ఆశ్చర్యచకితుల్ని చేసింది. మర్నాడు ఆయన్ని బస్సు ఎక్కించిన గుర్తు.

తర్వాత డాక్టర్ సమరం, లవణంగారు, హేమలతా లవణంగారూ సన్నిహితులయారు.

అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అంతకు ముందు ఎన్నికలలో కాంగ్రెస్ తరపున ప్రచారానికి చిత్తూరు వచ్చినప్పుడు సభలకి నేను హాజరయి పత్రికలలో రాశాను. ఉపన్యాసాల్లో ఆయన పద్యాలు  చాలా హృద్యంగా చదివేవారు. చిన్న నాటకీయత, కళాత్మకమయిన వాసనా ఆయన రాజకీయ ఉపన్యాసాల్లో ద్యోతకమయేది. రాజకీయాల ఊకదంపుడు రొద – ఆయన ఉపన్యాసాల్లో అంతగా కనిపించేదికాదు. దరిమిలాను ఆయన ముఖ్యమంత్రి అయారు. తరువాత రాష్ట్ర పార్టీలో వచ్చి రాజకీయ సంక్షోభంలో నాయకులతో మంతనాలకి అనుకుంటాను అదాటుగా పర్యటనకి బయలుదేరారు. ఆయనా, ఆర్ధికమంత్రి అల్లురి సత్యనారాయణరాజుగారూ.

నేను నెలనెలా హరిజన వాడలకి వెళ్ళే సందర్భంలో కె.రామస్వామి అయ్యంగార్ ఎప్పటికప్పుడు హరిజన సమస్య మీద నన్ను నాటిక రాయమని ప్రోత్సహిస్తూ వచ్చారు. హరిజనుల మధ్య, వారి సమస్యలని అవగాహన చేసుకుంటూ తిరిగిన వాడిగా ఆ సమస్యకి క్రమంగా ఒక మానసికమయిన రూపం ఏర్పడింది. చాలా చక్కని మెలో డ్రామా రాశాను. నేను 'చాలా చక్కని' రచన అనడానికి కారణం చక్కెర తియ్యగా ఉంటుందని ఎవరూ కితాబునివ్వనక్కరలేదు కనుక. తర్వాత చాలామంది ఆ మాట అన్నారు కనుక.

సంజీవయ్యగారూ, అల్లూరివారూ ఫలానా రోజున చిత్తూరు వస్తున్నారని తెలియగానే రామస్వామిగారు రంగంలోకి దూకారు. హరిజన సంక్షేమ సంఘ అధ్యక్షునిగా నా చేత నాటిక వేయించాలని పూనుకున్నారు. సందర్భం హరిజన ముఖ్యమంత్రి సమక్షం. చిత్తూరు పర్యటనలో ఆయన మా నాటిక సందర్శించడానికి అంగీకరించారు. అంతే. మద్రాసు నుంచి స్త్రీ పాత్రకి నవీన లక్ష్మిని పిలిపించాను. శ్రీరామ విలాస సభలో ప్రతి దినం రిహార్సల్స్. ప్రదర్శన రోజున

సంజీవయ్యగారూ, అల్లూరిగారూ ఎక్కడెక్కడో చర్చలు జరిపి ఆలశ్యంగా రాత్రి పదిన్నరకి వచ్చారు. మంచు పడుతోంది. తలమీద కండువా వేసుకుని సంజీవయ్యగారు నాటిక చూశారు. రాత్రి 11.30 అయింది. ప్రేక్షకులూ ఉండి చూశారు. నాటిక అద్భుతంగా సాగింది. జిల్లా న్యాయమూర్తి దాడి గోవిందరాజులు నాయుడు గారయితే ఉబ్బితబ్బిబ్బయిపోయారు. చిత్తూరు పురప్రముఖులలో సాహితీ, నాటక ప్రియులలో ఆయన ముఖ్యులు. చిన్నతనంలో ఆడవేషాలు వేశారు. నాటక పక్షపాతానికి గోపాలస్వామి నాయుడుగారికి తీసిపోరు. ఆంధ్రనాటక కళాపరిషత్తుతో బాంధవ్యం ఉన్న వ్యక్తి. ఆనాడు చిత్తూరులో గుంటూరు శేషేంద్రశర్మ, బి.కె.రావు (ఐ.ఏ.యస్), దాడి గోవిందరాజులు నాయుడు, ఆర్.బి. రామకృష్ణంరాజు, కె.రామస్వామి అయ్యంగార్ వంటి కళాప్రియులున్నారని ఒక్క మాట చెపితే చాలు. నాలాంటి వాడికి చిత్తూరు ఎంతగా 'వడ్డించిన విస్తరి' అయిందో అర్థమయిపోతుంది. దానికి తోడు తెలుగుదేశంలో అత్యధిక సర్క్యులేషన్ ఉన్న దినపత్రిక ఆంధ్రప్రభలో ఉద్యోగం నిప్పుకి గాలి తోడయినట్టే.

తర్వాత జి. కృష్ణగారు ముఖ్యమంత్రికీ, అల్లూరి వారికీ ఉత్తరాలు రాసి వారి స్పందనని తెప్పించారు. సంజీవయ్యగారి ఉత్తరం ఇప్పటికీ నా దగ్గర ఉంది. ముందు ముందు ఉద్యోగాలకి సంజీవయ్యగారి ఉత్తరం తుపాకీలాగ పనిచేసేది. నా జీవితంలో చాలాకాలం పటం కట్టి దాచిన ఉత్తర అదొక్కటే! తర్వాత ఉత్తరాలూ పెరిగి, పటాలు పెరిగి దాచుకోవలసింది అనుభూతుల్ని కాని పటాల్ని కాదన్న అవగాహన పెరిగింది. ఇప్పటికీ మా యింట్లో నాయకులతో, నటులతో ఫోటోలు గోడలకి వేలాడవు. అలాగే సన్మాన పత్రాలు గోడలకి ఉంచే అవకాశం లేదు. వేలాడదీయాల్సి వస్తే గోడలు చాలవు. నా సన్మాన పత్రాలూ, జ్ఞాపికలకి రెండంతస్తుల భవనం కావాలి. 'ఎప్పుడూ మనిషి రేపు మీద దృష్టి సారించాలి. నిన్నని చూసి గర్వపడకూడదు' అనేవాడిని పిల్లలతో. మా ఆఖరి అబ్బాయి వాసూకి అది బాగా తలకెక్కింది. వాడి జీవితంలో సంపాదించిన ఒకటి రెండు ఫోటోలూ గోడ దించేశాడు. చివరికి వాడే ఫోటో అయి గోడమీద మిగిలిపోతాడనుకోలేదు.

అప్పటికి నా 'చీకటిలో చీలికలు ' నవల రచన పూర్తయిపోయింది. వెంటనే నవోదయా ప్రకాశరావుగారు ముద్రణ ప్రారంభించేశారు. దాదాపు 500 పేజీల నవల. ఆ తర్వాత నేనెప్పుడూ అంత పెద్ద నవల రాయలేదు.

ఈ సందర్భంలోనే ఉగాది సభకి ఇద్దరు గొప్ప పండితులు హాజరయారు. పూతలపట్టు శ్రీరాములు రెడ్డి, పుట్టపర్తి నారాయణాచార్యులు. రెడ్డిగారిది పూతలపట్టు. వృత్తిరీత్యా అక్కడ ఉపాధ్యాయులు. ఒకసారి వారి ఊరు వెళ్ళి ఆయన్ని కలిశాను. అతి కమ్మనయిన శైలిలో వారు రామాయణాన్ని రచించారు. నిండుకుండ. క్లుప్తంగా మాట్లాడేవారు. మంచిధార. ఇక పుట్టపర్తిగారి గురించి చెప్పనక్కరలేదు. బహుభాషా వేత్త. 'శివతాండవం' ఆయన చదివితే వినాల్సిందే. నటరాజుని

మాటల్లో నాట్యం చేయిస్తారు. అప్పటికి వారి గురించి వినడమే గాని ఎక్కువగా తెలీదు. ఎందుకు అడిగానో వారిని నా నవలకి పీఠిక రాయమని అడిగాను. ముందు జీవితంలో రెండు పనులు చెయ్యలేదు. మరొకరిని పీఠిక రాయమనడం. దానికి కారణం ఉంది. పీఠిక సాధారణంగా ప్రశంస రూపంలోనే ఉంటుంది. తన రచనని విమర్శ చేసే రచయితనో, పెద్దమనిషినో కోరి పిలిచి ఎవరూ పీఠిక రాయించుకోరు. 'పీఠిక' వ్రాయమనడం అంటే "బాబూ  చదివి నా గొప్పతనాన్ని కాస్త వివరించండి" అని కోరడం అని నాకనిపిస్తుంది. ఒక రచన గొప్పదనో, మంచిదనో చదవదగిందనో చెప్పడానికి మరొక లబ్ధప్రతిష్టుడయిన రచయిత 'మొహమాటపు' మాటలు ఎరువు తెచ్చుకోవడం. అది తప్పనిసరి 'ముఖప్రీతి' అని నాకనిపిస్తుంది. అందుకనే తొలిరోజుల్లో నిజానికి నా మొదటి నవలకి తప్ప మరే రచనకీ నేను 'ముందు మాట' వ్రాయమని ఎవరినీ కోరలేదు.

"వందేమాతరం" నాటికకి ఆ నాటికని ప్రచురించిన ఆంధ్రప్రదేశ్ సమాచార పౌర సంబంధాల శాఖ అప్పటి మంత్రి పీ.వి నరసింహారావుగారి చేత ముందుమాట వ్రాయించింది. ఆయన వ్రాసిన మాటలు "...ఈ నాటిక రాష్ట్రంలో సమర సాహిత్యానికి తొలి మెరుగులు దిద్దుతున్నది. రచనలో కొన్ని శాశ్వత విలువలు కూడా నాకు గోచరించాయి. సంభాషణలో వేగమూ చక్కని పలుకుబడీ ఉన్నాయి.  వీరి కలంలో ఎంతో బలం ఉంది."

నిజానికి ఆయన ప్రధానిగా పదవీ విరమణ చేశాక నా 'సమగ్ర సాహిత్యం' మీద తులనాత్మక వ్యాసం వ్రాసి యివ్వమని కోరాను. "మీరు అడిగారు కనుక రాయను. అన్ని పుస్తకాలూ చదివాక వ్రాస్తాను" అన్నారు. సమగ్ర సాహిత్యం అంతా పంపాను. అప్పటికి లెబనాన్ కమీషన్ వ్యవహారాలతో తలమునకలయి ఉన్నారు. తర్వాత కొన్నాళ్ళు అనారోగ్యంతో ఉన్నారు. ఆ దశలో నా "సాయంకాలమయింది"  నవల చదివి ఒక అభినందన లేఖని వ్రాశారు. నేను కోరిన 'తులనాత్మక' వ్యాసం వారి నుంచి నాకు దక్కలేదు.

మరొక అలవాటు – ఏవో అరుదయిన సందర్భాలలో తప్ప – ఎవరికీ నా పుస్తకాలు ఇవ్వకపోవడం. మర్యాదగా చేతికి పుస్తకం  యిస్తే ఏదో పుస్తకం మారుతిరావు గిలికి ఇచ్చాడయ్యా అంటారేమోనని కాంప్లెక్స్. తత్కారణంగా 1958లో ప్రచురితమయిన 'అనంతం' దగ్గర్నుంచి, యిప్పటిదాకా ప్రింటయిన అన్ని పుస్తకాల తొలి ప్రతులూ ఎర్రబడి, పాతబడి యిప్పటికీ నా బీరువాల్లో మూలుగుతున్నాయి. ఇదొక వానిటి అనుకున్నా తప్పులేదు. ఒకవేళ పుస్తకాలిచ్చినా దాని మీద పేరు రాయకుండా సంతకం చెయ్యకుండా ఇవ్వడానికి ప్రయత్నిస్తాను. కొందరు ఆ పుస్తకాన్ని వెనక్కి తెచ్చి, పేరు రాసి ఇవ్వమన్న సందర్భాలు బోలెడు. ఇది అర్థం లేని ప్రైడ్. కాని స్వభావానికి అర్థాన్ని వెదకడం కష్టం.

ఉగాది సభ తర్వాత పుట్టపర్తిగారితో ఓసారి వెల్లూరు వరకూ వెళ్ళాను. ఆ సందర్భంలోనే వారిని 'చీకటిలో చీలికలు' నవలకు పీఠిక రాయమన్నాను. ఆయనకి నేనెవరో అంతగా తెలీదు. కాని నవలని చదివి సమగ్రంగా ముందు మాట రాశారు. 'ఈ రచయితకి ఉచ్చులు అల్లడం బాగా వచ్చు' అనడం ఒక్కటే గుర్తుంది.

ఆ రోజుల్లో ఉత్తరాలు ఒక్కటే సమాచార సాధనాలు. రోజుకి 15 నుంచి 20 ఉత్తరాలు రాసేవాడిని. టెలిఫోన్లు, కంప్యూటర్లు వచ్చాక ఈ అలవాటు బాగా తగ్గిపోయి లేఖా సాహిత్యమనే ప్రక్రియ పూర్తిగా చచ్చిపోయింది. ఆనాటి శరత్ ఉత్తరాలు, చలం ఉత్తరాలు నాకు ప్రియమయిన గ్రంథాలు. అప్పట్లో నా ఉత్తరాల మీద శరత్ ప్రభావం ఉండేది. వజీర్ రెహ్మాన్, కేతు విశ్వనాథరెడ్డి, వేదాంతం సుబ్రహ్మణ్యం, ఆచంట జానకీ రాం, పురిపండా, తిరుమల రామచంద్ర, మొసలికంటి సంజీవరావు (మొగలాయి దర్బారు రచయిత. అప్పటికే ఆయనకి 75 ఏళ్ళు. విశాఖలో పాల్టాట్ కాఫీ వర్క్సుకి ఎదురుగా లోపలకి ఉన్న ఇంట్లో ఉండేవారు. నన్ను మసూనాగారు తీసుకెళ్ళి వారికి పరిచయం చేశారు), జేష్ట్య, శ్రీపతి, పిలకా గణపతి శాస్త్రి – వంటివారితో ఉత్తర ప్రత్యుత్తరాలు సాగేవి.

ఏ సందర్భంలో జరిగిందో గుర్తులేదు కాని చిత్తూరులో బి.యెన్.రెడ్డిగారికి సన్మానం జరిగింది. వారితో కె.వెంకటేశ్వరరావు వచ్చాడు. మల్లీశ్వరి, బంగారుపాప వంటి కళాఖండాలను తీసిన రెడ్డిగారిని చూడడమే ఒక పులకరింత. నన్ను ఆయనకి వెంకు పరిచయం చేశాడు. అప్పటికే నా 'రాగరాగిణి' మద్రాసు ప్రేక్షకుల్ని ఊపి ఉర్రూతలూగించిన విషయం (దానికి ముఖ్యకారకుడు కె.వెంకటేశ్వరరావు) రెడ్డిగారు విని ఉన్నారు. తనతో రమ్మని మద్రాసు ఆహ్వానించారు. అంతే. ఎగిరి గంతేసి ఆయన కారెక్కాను. దారి పొడుగునా కబుర్లు సాగాయి. కారు నడుస్తూండగా ఉన్నట్టుండి ఒకే ఒక అర్థంలేని ప్రశ్న అడిగాను.

"రెడ్డిగారూ! మన ప్రేక్షకులకి ఎలాంటి చిత్రాలు కావాలి?"

ఆయన కారులో నావేపు తిరిగి 'అదొక్కటి తెలియకే తలలు బద్దలుకొట్టుకుంటున్నాం' అన్నారు.

42 సంవత్సరాలు – 400 సినిమాలు (రాసినవీ, వేసినవీ – చిల్లరా చితుకూ అన్నీ కలుపుకుని) గడిచాక – ఆ ప్రశ్నకి యింకా నాకు సమాధానం దొరకలేదు. సినిమా చరిత్రలో ఎవరికీ దొరకలేదనుకుంటాను – సత్యజిత్‌రే దగ్గర్నుంచి స్టీవెన్ స్పీల్‌బర్గ్ దాకా.

చలంగారు మ్యూజింగ్స్‌లో తెలుగు సినిమా మీద ఒక వ్యాసం రాశారు. ఆయన ఇల్లు ఓ సినిమా థియేటర్ పక్కనే ఉండేదట. ఆ డైలాగులూ, శబ్దాలు వినబడుతూండేవి. "నాది తీసెయ్యకురో" అని సినిమాలో హీరోయిన్ పరిగెత్తుతోందట. పక్కింటినుంచి శబ్దం మాత్రమే వింటున్న చలంగారికి ఏం తీసెయ్యడమో అర్థం కాలేదట. కాసేపయ్యాక "నా శీలం

తీసెయ్యకురోయ్" అంటోందట హీరోయిన్. "సినిమా వాళ్ళకి అది చేతికే దొరికి వుంటే ఎక్కడికి గిరాటేసేవారో" అని వాపోయారు.

ఈ ప్రశ్నకు సమాధానం దొరకకుండానే సినిమాలు ఇన్ని వెర్రి తలలు వేస్తున్నాయే – నిజంగా దొరికితే ఏమయేదా అనిపిస్తుంది.

"ఇది రాణించే మూస" అనుకోవచ్చుగని "ఇది రాణిస్తుంది" అనుకోవడం సాహసం – "ఇదే రాణిస్తుంది" అనుకోవడం అహంకారం – అప్పటికీ, యిప్పటికీ, ఎప్పటికీ.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments